క్లుప్తంగా

నూతన ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ

రాయచోటి టౌన్ : రాయచోటి డివిజన్ పరిధిలోని నూతనంగా డీఎస్సీ ద్వారా వచ్చిన ఉపాధ్యాయులకు ఈ నెల 19వ తేదీన రాయచోటి డైట్ కళాశాల ఆర్‌జేయూపీ ఆధ్వర్యంలో అవగాహన (శిక్షణ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌జేయూపీ జిల్లా ప్రెసిడెంట్ సిద్దయ్య, జాయింట్ సెక్రటరీ సి.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన టీచర్స్ సర్వీస్ రూల్స్, మెడికల్ లీవ్స్‌లతో పాటు మరిన్ని విషయాలపై నిపుణులతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం 19వ తేది ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



పూజల్లో పాల్గొన్న గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం దేవళంపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, ఆలయ ప్రారంభోత్సవ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కాగా విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా నిర్వహించిన స్వామివారి కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. పూజల్లో గడికోట ప్రభాకర్ రెడ్డి, వీరబల్లి నాగశేఖర్ రెడ్డి, వీరబల్లి ప్రసాద్ రెడ్డి, శంకర్ రెడ్డి, నాగ బసి రెడ్డి, రమణరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, దర్బార్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత ఆలయంలో..



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎర్రపురెడ్డి ఆరంరెడ్డి

సుండుపల్లె : మండల పరిధిలోని కంచిపాటివాండ్లపల్లెలో నూతనంగా గ్రామస్తులు అందరూ కలిసి గ్రామ దేవత నాగదేవత ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం ఉదయాన్నే వేదపండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఎర్రపురెడ్డి ఆరంరెడ్డి నాగదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మారమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో మారమ్మ

పుల్లంపేట : స్థానిక మెయిన్ బజారులోని మారమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా మారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం భజన కార్యక్రమాలు జరిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



డ్రైనేజీ పనులు చేస్తున్న సిబ్బంది

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలో డ్రైనేజీ పనులు ముమ్మరంగా చేపట్టారు. ఉప సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. బస్టాండ్ నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు డ్రైనేజీలో పూడిక తీశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న డ్రైనేజీకి పైపులు వేసి సిమెంట్ వేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



రైల్వేకోడూరు : భోళా శంకర్ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండల సుబ్రమణ్యం కుమారుడు కీ.శే.లు మండల ప్రతాప్ పుట్టినరోజు సందర్భంగా మూడు పేద కుటుంబాలకు ఉచితంగా నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు మండల నాగేంద్ర, చెన్నంశెట్టి రమేష్, బాబు, కిరణ్, శివకుమార్, భాస్కర్, నాగరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో వ్యాపారం దుర్మార్గం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలి
- చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరనిద్రోహం
- రచ్చబండ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రామాపురంలోని సరస్వతిపల్లెలో రచ్చబండ కార్యక్రమంలో ప్రజలతో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : ప్రజల ఆరోగ్యాన్ని కూటమి ప్రభుత్వం వ్యాపారంగా మార్చే ప్రయత్నం ఓ దుర్మార్గ విధానమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లె, సుద్దమళ్ల, కల్పనాయిని చెరువు, గోపగుడిపల్లె, కసిరెడ్డిగారి పల్లె, గువ్వలచెరువు, నీలకంఠరావుపేట గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నామని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో మెడికల్ కాలేజీలను నిర్మించాలని తలంపిస్తే, వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి చేతులు దులుపుకోవాలని కూటమి ప్రభుత్వం భావించడాన్ని శ్రీకాంత్‌రెడ్డి తప్పుబట్టారు. ఒకసారి ప్రైవేటుపరం అయితే ప్రభుత్వ అజామాయిషి ఉండదన్నారు. ఆస్పత్రులలో బెడ్‌ల సంఖ్య తగ్గడంతో పాటు ఆదాయమే లక్ష్యంగా ప్రైవేటు వ్యక్తులు పని చేస్తారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించే ఈ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యులను చేయడానికి కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చామన్నారు. సేకరించిన సంతకాలను రాష్ట్ర గవర్నర్‌కు అందజేసి సమస్య తీవ్రతను తెలియజేస్తామన్నారు. కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం వెనక్కి తీసుకునేదాకా పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే మూల స్తంభాలు

కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వాటిని ఎదుర్కొంటున్న ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని శ్రీకాంత్ రెడ్డి భరోసానిచ్చారు. పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని పేర్కొన్నారు. వారికి అన్యాయం జరిగితే సహించేది లేదని తెలియజేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి శ్రీకారం చుట్టామని, కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు అందజేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీ కింద ప్రజలకు వైద్యం అందించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమయ్యిందని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ కింద ఉన్న పెండింగ్ బకాయిలను చెల్లించి ప్రజల ఆరోగ్యానికి అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. రైతులు సాగు చేస్తున్న ఏ పంటకు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తున్నా ప్రభుత్వం ఆదుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రైతులకు పండుగలా సాగితే నేడు కూటమి పాలనలో రైతులను విస్మరించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, వైఎస్ఆర్సీపీ స్టేట్ వింగ్ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, వైస్ ఎంపీపీ రవిశంకర్ రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

దోపిడీకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

రైల్వేకోడూరు అర్బన్ : పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉన్నత లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్మిస్తే వాటిని కేవలం దోపిడీ కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేస్తున్నారని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కుక్కలదొడ్డి పంచాయతీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేద ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఆరోగ్యశ్రీని ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు కేటాయించి ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ పేదల కోసం ముందుచూపుతో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కేవలం రాజకీయ కక్షలను ప్రేరేపిస్తూ వేధింపులు, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ, అక్రమ కేసులు బనాయిస్తూ కాలం వెలిబుచ్చుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, సర్పంచ్ పూర్ణిమ, శివయ్య, రమణ, చంద్రశేఖర్, షఫీ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



కుక్కలదొడ్డి గ్రామస్తులకు ప్రైవేటీకరణతో జరిగే నష్టాలను వివరిస్తున్న ధ్వజారెడ్డి, నాయకులు

జగన్ హయాంలోనే వైద్య విద్య అభివృద్ధి



శిబ్యాల విజయ భాస్కర్

రాయచోటి అర్బన్ : గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చి వైద్య విద్యను అభివృద్ధిలోకి తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ వైద్య విద్యను అభివృద్ధి చేయాలని తలిస్తే, చంద్రబాబు నాయుడు మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ వైద్య విద్యను కార్పొరేట్ సంస్థలకు అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయద్దు అని ప్రజలు, విద్యార్థులు దండం పెడుతున్నా, కూటమి ప్రభుత్వం లెక్కచేయడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కూటమి నాయకుల అక్రమాల నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి గూగుల్ కంపెనీ తీసుకొచ్చామని పచ్చ పత్రికల్లో ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. గూగుల్ కంపెనీకి ప్రజాధనం అంతా దోచిపెట్టి, ఆ విషయాలు బయటపెట్టకుండా దాచుతున్నారని తెలిపారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారనేది గుర్తించుకోవాలని చెప్పారు.

ఇచ్చిన హామీ మరిచారా.. ముక్కా?



ఒంటేల సిద్దయ్య నగర్‌లో బురద నీటిలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు ప్రజలకు చేసిన హామీలు నీటిబుడగలుగా మారాయని సీపీఐ, బీకేఎంయూ నాయకులు విమర్శించారు. నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తదితర నాయకులు ఒంటేల సిద్దయ్య నగర్ వీధిలో పర్యటించి సీసీ రోడ్డును తక్షణమే వేస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా నోచుకోలేదని మండిపడ్డారు. దీంతో శుక్రవారం బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు పండుగోలు మణి, సీపీఐ నాయకులు స్థానికులతో కలసి కాలనీలోని బురద రోడ్డులో కబడ్డీ ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని అనేక సార్లు మొరపెట్టుకున్న అధికార పార్టీల నాయకులు వినిపించుకోవడంలేదని చెప్పారు. పైప్ లైన్ తీస్తామని 2500 రూపాయలు డబ్బులు వీధిలో వసూలు చేసి ఇంతవరకు పైపులైన్‌లు ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. రోడ్డులో ఉన్న గుంతలకు ఎర్రమట్టి తోలి మిన్నకుండి పోయారని అన్నారు. దీంతో అనేక మంది ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు పడి గాయపడుతున్నారని తెలియజేశారు. ఇంకెప్పుడు రోడ్డు వేస్తారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు వేసి, ప్రతి ఇంటికి పైప్ లైన్ ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యకమంలో సీపీఐ కార్యదర్శి రాజశేఖర్, వెంకటరమణ, గంగాపురి తేజ, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

'జీఎస్టీని సక్రమంగా పాటిస్తే ఆర్థికాభివృద్ధి'



రాయచోటి జగదాంబ సెంటర్: అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు



రాజంపేట: గెస్ట్ లెక్చర్ ఇస్తున్న సీఏ డాక్టర్ అశోక్‌కుమార్

రాజంపేట : జీఎస్టీని సక్రమంగా పాటిస్తే దేశ ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం అన్నమాచార్య యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై ఆయన గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ కేవలం పన్ను విధానం కాదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణ అన్నారు. పౌరులు జీఎస్టీ విధానాన్ని అర్థం చేసుకోవాలని చెప్పారు. పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుందన్నారు. జీఎస్టీ పరిణామక్రమం, ఒకే పన్ను విధానం వల్ల వ్యాపార సౌలభ్యం పెరగడం, డిజిటల్ పన్ను విధానాల పట్ల అవగాహన ఉండాలన్నారు. జీఎస్టీ ద్వారా డిజిటల్ ఆర్థికవ్యవస్థ బలపడుతుందన్నారు. దేశ ఆర్థిక సుస్థిరతకు దోహదం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏయూ వీసీ డా.సాయిబాబారెడ్డి, ఎంబీఏ హెచ్‌ఓడీ డా.టి.నవనీత, ఫ్యాకల్టీ సభ్యులు, ఎంబీఏ విద్యార్థులు హాజరయ్యారు.

సాయి ఇంజనీరింగ్ కళాశాలలో..

రాయచోటి జగదాంబసెంటర్ : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో ప్రజల్లో పండుగ వాతావరణం నెలకొందని అన్నమయ్య జిల్లా హాకీ సెక్రటరీ, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలలో సూపర్ జీఎస్టీ – సూపర్ పొదుపుపై డీఎస్‌డీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గించడం వలన కలిగే లాభాలను రేటు తగ్గిన వస్తువులపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్, అసిస్టెంట్ జీఎస్టీ కమిషనర్, యువజన శాఖ అసిస్టెంట్ కమిషనర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దేవపట్ల గ్రామ సర్పంచ్‌గా ఇమాముల్



సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల సర్పంచ్‌గా ఇమాముల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా ఉన్న ఆవుల వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన స్థానంలో అసంజిగారి పల్లెకు చెందిన (వైస్ సర్పంచ్)గా ఉన్న నాగూరి ఇమాముల్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నట్టు తెలిపారు.

తెలుగు భాష అమలుకు చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో తెలుగు భాష సంపూర్ణంగా అమలుకు చర్యలు తీసుకోవాలని, తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను కలసి కోరారు. వైవీయూలో మొల్ల జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని కోరారు.

ప్రాణాపాయ స్థితిలో సీపీఆర్‌తో బతికించవచ్చు



సీపీఆర్ ఎలా చేయాలో గ్రామస్తులకు చూపిస్తున్న వైద్యాధికారి రంగలక్ష్మి

సిద్దవటం : మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు సీపీఆర్‌తో మనిషిని బతికించవచ్చునని సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు. సిద్దవటం మండలం పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంటిగారిపల్లి గ్రామంలో వైద్యురాలు డాక్టర్ రంగలక్ష్మి, సిద్దవటం సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సీపీఆర్ (హృదయ శ్వాస పునరుద్దరణ), ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగటిగారిపల్లె గ్రామ ప్రజలకు ఆరోగ్య కేంద్ర వైద్యురాలు మనిషి గుండె ఆగిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు సీపీఆర్ చేయడం వల్ల చాలా వరకు ఒక మనిషి ప్రాణాన్ని బతికించవచ్చునని సీపీఆర్ ఎలా చేయాలో చూపించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి గ్రామంలోని ప్రజలకు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, ఫైలేరియా గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్త సువర్ణ, 104 సిబ్బంది, అంగన్వాడీ వర్కర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సొంత ఆదాయ వనరులను సృష్టించుకోవాలి



లక్కిరెడ్డిపల్లె: మాట్లాడుతున్న ఎంపీడీఓ రెడ్డయ్య



నందలూరు: సూచనలు చేస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

నందలూరు : సొంత ఆదాయ వనరుల సృష్టి, పన్ను, పన్నేతర ఆదాయ వనరుల పెంపొందించుకొనుటకు తీసుకోవాల్సిన చర్యలను గురించి ఎంపీడీఓ ప్రసాద్ వివరించారు. పంచాయతీరాజ్ కమిషనర్ విజయవాడ వారి ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయం నందు రెండు రోజులు శిక్షణలో భాగంగా మొదటిరోజు శుక్రవారం గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. శిక్షణ కార్యక్రమం నందు ట్రైనర్ నరసింహులు పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా గ్రామ పంచాయతీలో సొంత వనరులు ఏ విధంగా పెంపొందించుకోవాలి, పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయాలు, సాంకేతిక అంశాలు, ప్రవర్తన నియమాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఏపీఎస్ఐఆర్‌డీ ఆదేశాల మేరకు మొదటి రోజు శిక్షణను నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి కార్యాలయ పరిపాలన అధికారి హబీబుల్లా, గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : గ్రామ పంచాయతీల స్వీయ ఆదాయ వనరులను పెంపొందించడంపై అవగాహన సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 17, 18 వతేదీల్లో రెండు రోజుల పాటు మండల ప్రాజెక్టు అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓఎస్ఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల స్వీయ ఆదాయ వనరులను పెంపొందించడం, ఆస్తుల నిర్వహణ, భూముల లీజు విధానాలు, బజార్ల నిర్వహణ, పన్నులు వసూలు, టోల్ ఫీజు, వాణిజ్య భవనాల అద్దెలు వంటివి సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలోని ఆదాయ వనరులను సమకూర్చుకొని పంచాయతీలను అభివృద్ధి పరచుకోవాలని ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం గ్రామ పంచాయతీలలో సొంతంగా వనరులను సమకూర్చుకునే అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులదే కీలకపాత్ర

లక్కిరెడ్డిపల్లి : గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే గ్రామ కార్యదర్శులదే కీలకపాత్ర అని ఎంపీడీఓ రెడ్డయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో గ్రామ పంచాయతీ ద్వారా ఆదాయ వనరులు పెంపొందించడం ఎలా అన్న విషయాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులను దేనికి ఉపయోగించాలి అన్న విషయంపై తెలియజేశారు. ముఖ్యంగా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటిని ఎలా పరిష్కరించాలన్నది పంచాయతీపైనే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణదేవరాయల పరిపాలన ఆదర్శం



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు సంఘం నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహం వద్ద కాపు సంఘాలు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణదేవరాయలు 496వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పాలాభిషేకం చేసి గజమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని తరాలైనా, శతాబ్దాలైనా రాయలవారి పరిపాలన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, నంద బాల, బండారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం.. గౌరవంగా బతకనిద్దాం

- ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం
- విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు.. బహుమతుల ప్రదానం
- బాలికల హక్కులను వివరించిన టీచర్లు



సుండుపల్లె: విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



పెనగలూరు: పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న టీచర్లు



రామాపురం: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వీరబల్లి : ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించడంతోపాటు సమాజంలో గౌరవంగా బతికేలా చూసుకోవాలని యర్రంరాజుగారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఓదివీడు గ్రామం యర్రంరాజుగారిపల్లి హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపరాదని తెలియజేశారు. వారిని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. బాలికల విద్యకోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని, వారి రక్షణ కోసం పలు రకాల చట్టాలను కూడా తీసుకువచ్చిందన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి, సుజాతరెడ్డిల ఆధ్వర్యంలో మండలంలోని ఏపీ మోడల్ స్కూలు, కేజీబీవీ స్కూలు, కొండవాండ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపల్ శ్యామలదేవి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

సుండుపల్లె : అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల హక్కులను కాపాడటం.. లింగ ఎంపిక, గర్భస్రావ నిషేధ చట్టం అంశంపై చిత్రలేఖన పోటీలు శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన ఈ పోటీల్లో పదవ తరగతి విద్యార్థిని నవ్యలత మొదటి బహుమతి పొందగా, కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతులమీదుగా రాయచోటి కలెక్టరేట్‌లో ఎంఈఓ రవీంద్రనాయక్ బహుమతిని అందింపజేశారు.

పెనగలూరులో..

పెనగలూరు : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు లింగ వివక్ష – బాలికల చదువు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో జరిగిన ఈ పోటీలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమార్ ఆధ్వర్యంలో జరిపారు. గంగాధర్ బాబు, కస్తూర్బా గాంధీ ప్రిన్సిపల్ సుచరిత, విజయకుమారీలు విద్యార్థులకు బాలికల విద్యా ప్రాముఖ్యత, పౌష్టికాహారం, హక్కులు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థినులు బాల్య వివాహాలపై మీమీ గ్రామాలలో కూడా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. అంతకుముందు వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, నాయుడువారిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



వీరబల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు